సాక్షి ప్రకాశం

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



ఈ-పంట జాప్యం.. రైతులకు శాపం!

జిల్లాలో ఈ-పంట నమోదు కార్యక్రమం ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. కానీ, ఇప్పటి వరకు 87 శాతం మాత్రమే ఈ-పంట నమోదైంది. - 8లో..



లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

రాజీపడదగిన కేసులపై కక్షిదారులతో మాట్లాడి ఈ నెల 14న నిర్వహించే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని పోలీసులను ఎస్పీ దామోదర్ ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 37.5/28

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. తేమ శాతం అధికం. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌ను కలిసిన జూపూడి



ఒంగోలు సెంట్రల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు కలిశారు. రాష్ట్రంలోని రాజకీయాలు, తదితర విషయాలపై చర్చించారు.

పొగాకు కేజీ గరిష్ట ధర రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో గురువారం నిర్వహించిన వేలంలో కేజీ గరిష్ట ధర రూ.358 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం... కందుకూరు-1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి వేలం కేంద్రాల్లో 148వ రోజు నిర్వహించిన వేలానికి 5,954 బేళ్లు రాగా, వాటిలో 4,720 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,234 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.159, సరాసరి రూ.261.01 పలికింది.

15న ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అయ్యపురెడ్డి

ఒంగోలు: జిల్లాలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ రిటైర్డ్, ప్రస్తుత సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యపురెడ్డి తెలిపారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్‌కే జిలానీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దివాకర్ తదితరులు హాజరవుతారన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, సభ్యులు తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పచ్చదనం కోసం కృషి చేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌కుమార్



మొక్కలు నాటుతున్న డీఎంహెచ్‌ఓ


ఒంగోలు టౌన్: వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తూ ప్రపంచాన్ని భయపెడుతున్న తరుణంలో వాతావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ అండ్ బ్లూ స్కై డే సందర్భంగా స్థానిక మెడికల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తున్న ఏకైక సమస్య వాతావరణమే అని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ తిరుమలరావు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ చెంచయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ ప్రభాకరరావు, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ పాల్గొన్నారు.

నూతన మెడికల్ కాలేజీలను ప్రారంభించాలి



రాష్ట్రంలో నూతన మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రారంభించాలి. దీనివలన ఇటీవల నీట్ రాసిన విద్యార్థులకు కొత్త మెడికల్ కాలేజీల్లో సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో నాకు 575 మార్కులు వచ్చాయి. మార్కాపురంలో మెడికల్ కాలేజీ ఉంటే నాకు ఇక్కడే సీటు వస్తుంది. మార్కాపురం ప్రాంతంలో ర్యాంకులు వచ్చిన విద్యార్థులు చాలామందికి ఇక్కడే మెడికల్ కాలేజీ ఏర్పాటుచేస్తే చదువుకునే అవకాశం ఉంటుంది.

– మోహన్‌పూర్ణ, నీట్ విద్యార్థి, మార్కాపురం



పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలల నిర్మాణాలు చేపట్టారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మార్కాపురం, పులివెందుల, మదనపల్లి, ఆదోని, పాడేరులో 750 మెడికల్ సీట్లతో అడ్మిషన్లు ప్రారంభించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల కలను ఛిద్రం చేసింది. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసేలా కుట్రలకు తెరతీసింది. నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతులు ఇస్తామంటున్నా.. మాకు వద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ ఇచ్చి వెన్నుపోటు పొడిచిందని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు.

మార్కాపురంలో మెడికల్ కాలేజీ కావాలి



ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో నాకు 530 మార్కులు వచ్చాయి. కొత్తగా మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే చాలా మంది విద్యార్థులు వైద్యవిద్య అభ్యసించే అవకాశం ఉంది. మార్కాపురంలో మెడికల్ కాలేజీని ఈ ఏడాది ప్రారంభిస్తే చాలా సంతోషంగా ఉండేది. ఇక్కడే ఉండి చదువుకునేవాళ్లం.

– కె.రాగ అక్షయ, మార్కాపురం

అభద్రతలో అధికారులు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజశేఖర్

ఆయన చిన్నాచితకా ఉద్యోగి కాదు.. గ్రూప్-1 ఆఫీసర్.. జిల్లా అధికారి.. జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. అలాంటి వ్యక్తిని అధికార పార్టీ టార్గెట్ చేసింది. ఇదే అదునుగా చూసుకుని కొంత మంది దుండగులు ఆయనపై దాడి చేశారు. ప్రభుత్వ అధికారిపై దాడిచేసిన వారు దర్జాగా బయట తిరుగుతున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి నుంచి వస్తున్న ఒత్తిళ్లతో పోలీసులు విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సదరు అధికారిని బదిలీ చేయాలని ఏకంగా లెటర్ ఇవ్వడం సంచలనంగా మారింది. గ్రూప్-1 అధికారిపై దాడి జరగడంతో జిల్లా అధికారులు సైతం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ రాజశేఖర్‌పై దాడితో భయాందోళన
- గ్రూప్-1 ఆఫీసర్ని టార్గెట్ చేసిన టీడీపీ
- అధికారిని బదిలీ చేయాలంటూ దామచర్ల లేఖ
- దాడి జరిగి వారం రోజులు కావస్తున్నా నిందితులను గుర్తించని పోలీసులు
- అధికార పార్టీ ఒత్తిళ్లే కారణమంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు
- నిందితులను అరెస్టు చేయాలంటూ ఉద్యోగ సంఘాల డిమాండ్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ పోలిశెట్టి రాజశేఖర్‌పై జరిగిన దాడితో జిల్లాలోని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో అభద్రతాభావం, భయాందోళన నెలకొన్నాయి. జిల్లా అధికారిపై దాడి జరిగితేనే దిక్కులేదు.. ఇక సామాన్యుల సంగతేంటని ప్రజలు సైతం చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ అధికారిపై దాడి చేసిన నిందితులు మాత్రం దర్జాగా బయట తిరుగుతున్నారు. పోలీసులు విచారణ పేరుతో రోజులు గడిపేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాక్షాత్తూ ఒక ప్రభుత్వ అధికారిపై దాడి జరిగినా విచారణలో తగినంత వేగం కనిపించకపోవడానికి కారణమేమిటన్నది అర్థం కాకుండా ఉంది. పోలీసులపై రాజకీయ, పాలనాపరమైన ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా అనే సందేహాలను కొందరు అధికారులు, ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

కళ్లల్లో కారం చల్లి కర్రలతో విచక్షణారహితంగా దాడి...

నంద్యాలకు చెందిన పోలిశెట్టి రాజశేఖర్ 2018లో గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఒంగోలులో జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్‌గా, సూపర్ బజార్ ఎండీగా విధులు నిర్వర్తిస్తున్నారు. విధి నిర్వహణలో నిజాయితీ కలిగిన అధికారిగా అనతికాలంలోనే పేరుతెచ్చుకున్నారు. ఆయన ఉద్యోగంలో చేరిన తర్వాత సొసైటీల ముసుగులో జరుగుతున్న అవినీతి భాగోతాలను వెలికితీశారు. కారుమంచి, కొమరోలు, పొన్నలూరు, పల్లామల్లి తదితర డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలలో జరిగిన అవినీతిపై ఆయన ఏకంగా 11 ఎంక్వయిరీలు వేశారు. రూ.3 కోట్లకుపైగా భారీ మొత్తంలో రికవరీలు చేయించారు. పోలీసు చర్యలకు రికమెండ్ చేశారు. దీంతో ఆయనకు సొసైటీలలో, సొంత శాఖలో శత్రువులు తయారయ్యారు. ఈ నెల 8వ తేదీ కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా కొందరు దారి కాచి దాడికి పాల్పడ్డారు. తేరుకునే అవకాశమే లేకుండా కళ్లల్లో కారం చల్లి కర్రలతో విచక్షణారహితంగా కొట్టారు. ఈ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ ఆయనకు ఎలాంటి ప్రాణాపాయం కలగలేదు. కలెక్టరేట్‌కు 150 మీటర్ల దూరంలోనే ఆయనపై దుండగులు దాడికి పాల్పడటం సంచలనం సృష్టించింది.

ఆరు రోజులుగా నిందితులను గుర్తించని పోలీసులు...

రాజశేఖర్‌పై దాడి ఘటనలో నిందితులు ఎవరన్నది ఇప్పటి వరకూ తేలలేదు. తన శాఖకు చెందిన పలువురు ఉద్యోగులే కుట్రపూరితంగా దాడికి పాల్పడ్డారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రాజశేఖర్ పేర్కొన్నారు. దాడి జరిగిన వెంటనే సమాచారం అందుకున్న అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు అర్ధ రాత్రి వరకు విచారణ జరిపారు. పోలీసు అధికారులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించినప్పటికీ నిందితులను గుర్తించలేకపోయారు. ఈ ఘటన జరిగి 6 రోజులు కావస్తోంది. అయినప్పటికీ నేటికీ నిందితులు దొరకలేదు సరికదా.. కనీసం గుర్తించలేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల కారణంగానే నిందితులపై కఠిన చర్యలు తీసుకోకుండా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

బదిలీ ప్రయత్నాలు ఫలించకపోవడంతోనే దాడి..?

కొన్నేళ్లుగా రాజశేఖర్‌ను బదిలీ చేయించేందుకు కొందరు నాయకులతో పాటు కో ఆపరేటివ్ ఉద్యోగులు సైతం అనేకసార్లు ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలేమీ ఫలించలేదు. అంతేగాకుండా ఉన్నతాధికారులు రాజశేఖర్‌కు మూడు సార్లు వరుసగా ఉత్తమ అధికారి అవార్డు ఇచ్చి సత్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముగ్గురు పీడీసీసీ చైర్మన్లతో కలిసి ఆయన పనిచేశారు. వారుగానీ, అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిగానీ ఆయనను ఎలాంటి ఒత్తిళ్లకు గురిచేయలేదు. కానీ, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే రాజశేఖర్‌ను బదిలీ చేయాలంటూ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్ లేఖలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈలోపు ఏకంగా ఆయన మీద దాడి జరగడంపై ఉద్యోగ సంఘాలు కలవరపడుతున్నాయి.

నిందితులను శిక్షించాలి :

ఆర్యవైశ్య వర్గానికి చెందిన డీసీఏఓ పోలిశెట్టి రాజశేఖర్‌పై దాడికి పాల్పడటం వెనక ఎవరున్నా సరే వదిలిపెట్టకుండా కఠినంగా శిక్షించాలి. రాజశేఖర్‌ను హత్య చేసేందుకే దాడికి పాల్పడ్డారు. ఒక ప్రభుత్వ అధికారి కళ్లల్లో కారం కొట్టి విచక్షణారహితంగా దాడి చేసి కొట్టడం అనేది క్రూరమైన చర్య. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ దాడిని సీరియస్‌గా తీసుకోవాలి. ఆర్యవైశ్యుల భద్రతకు భరోసా ఇవ్వాలి.

– కుప్పం ప్రసాద్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు



రాజశేఖర్‌ను బదిలీ చేయాలంటూ దామచర్ల ఇచ్చిన లేఖ

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

జిల్లా కో ఆపరేటివ్ అధికారి పోలిశెట్టి రాజశేఖర్‌పై దాడిచేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజశేఖర్‌ను ఉద్యోగుల సంఘ నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. ప్రభుత్వ అధికారిపై దాడిని ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి దాడులు జరగకుండా ఉండేందుకు దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పరామర్శించిన వారిలో సంఘ నాయకులు వరకుమార్, భాను రంగారెడ్డి, యాదవ్, రామ్మోహన్‌రావు, శ్రీనివాసరావు, మసూద్ అలీ తదితరులు ఉన్నారు.



రాజశేఖర్‌ను పరామర్శిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇతర సభ్యులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: పరిసరాల పరిశుభ్రత అనేది ప్రజల జీవన విధానంలో ఒక భాగం కావాలని, ఆ దిశగా ప్రజలకు అవగాహన పెంచి వారి ఆలోచనల్లో మార్పు తీసుకురావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ వీడియో సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. అనంతరం జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. అక్టోబర్ 2వ తేదీ స్వచ్ఛ భారత్ దివస్‌గా జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా పేరుతో ప్రజలను భాగస్వాములుగా చేస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. పక్షోత్సవాల్లో మానవ హారాలు, స్వచ్ఛతా రన్స్, మారథాన్స్, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ స్థలాల్లో స్వచ్ఛతా ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ అవగాహన కార్యక్రమాలు, పారిశుధ్య డ్రైవ్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు, ఇంకుడు గుంతల ప్రాధాన్యతలను తెలిపేలా అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పారిశుద్యంపై అవగాహన, గ్రామ, వార్డు సభల నిర్వహణ, తాగునీటి వనరుల క్లోరినేషన్, పార్కుల నిర్వహణ, సుందరీకరణ, ఆరోగ్య శిబిరాల నిర్వహణ తదితర కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డీపీఓ ఉషారాణి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, జెడ్పీ సీఈఓ మాధురి, ఇన్‌చార్జ్ డీఈఓ సామా సుబ్బారావు, డీఎంహెచ్‌ఓ సురేష్, డ్వామా పీడీ వందర్‌మాన్, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళీధర్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

భూగర్భ నీటిమట్టం పెంచడంలో భాగస్వాములు కావాలి...

భూగర్భ నీటి మట్టం పెంచడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, ఆ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో భూగర్భ వనరుల పరిస్థితిపై గురువారం ప్రకాశం భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లాలో పరిస్థితులను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 57 గ్రామాల్లో పరిమితికి మించి భూగర్భ జలాలు వినియోగించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. అక్టోబర్, నవంబర్ నెలల్లో జిల్లాలో కురిసే వర్షం నీటిని ఒడిసిపట్టి భూగర్భ నీటిమట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ దిశగా 14 గ్రామాలకు సంబంధించి రూపొందించిన వాటర్ బడ్జెట్ ప్రణాళికను ప్రజలకు వివరించాలన్నారు. అందులో భాగంగా వచ్చేవారం సంబంధిత గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి స్థానికులకు తెలియజేయాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మైక్రో ఇరిగేషన్, డ్వామా, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో భూగర్భ జల వనరుల శాఖ డీడీ విద్యాసాగర్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, ఏపీఎంఐపీ పీడీ రమణ, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఉద్యానవన అధికారి గోపీచంద్, డ్వామా పీడీ వందర్‌మాన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మురళీధర్‌రావు, ఇరిగేషన్ అధికారులు, రిలయన్స్, సార్డ్స్, ఎఫర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

యథావిధిగా శిలాఫలకాల ఏర్పాటు



యథావిధిగా స్థాపించిన శిలాఫలకాలు

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు సబర్బన్: స్థానిక ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) కార్యాలయంలో ధ్వంసం చేసిన శిలాఫలకాలను యథావిధిగా ఏర్పాటు చేశారు. గతంలో కంటే మెరుగ్గా నగరంలోని ప్రధాన రహదారి అయిన కర్నూలు రోడ్డులోకి కనిపించే విధంగా శిలాఫలకాలను అధికారులు స్థాపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడంపై ఈ నెల 5వ తేదీ 'టీడీపీ అరాచకాలు.. ట్రాన్స్‌కో అధికారుల దన్ను' శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ధ్వంసం చేసిన శిలాఫలకాలను యథావిధిగా నెలకొల్పారు. శిలాఫలకాల ముందు గడ్డి పెంపకతో పాటు చుట్టూ మొక్కలు పెంచే కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ బీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా ఎస్ఈ కార్యాలయ భవన నిర్మాణంతో పాటు వెంకటేశ్వరకాలనీవైపు అండర్ గ్రౌండ్ కేబుల్ లైన్ (ఇంకొల్లు హైటెన్షన్ విద్యుత్ లైన్) వెళ్లడంతో శిలాఫలకాలను తొలగించి పక్కన పెట్టామన్నారు. ఆ సమయంలో వరుసగా వర్షాల కారణంగా వెంటనే ఏర్పాటు చేయడానికి కొంత అసౌకర్యం ఏర్పడిందన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత శిలాఫలకాలను యథావిధిగా స్థాపించామని వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ ఇన్‌చార్జ్ ఈఈ సుధీర్‌బాబు మాట్లాడుతూ బాలినేని శ్రీనివాసరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటుకు పూనుకున్నారన్నారు. ఆ శిలాఫలకాల కిందిగా కేబుల్ వెళ్లడం వలన శిలాఫలకాలను తొలగించాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం గతంలో కంటే మెరుగ్గా శిలాఫలకాలు ఏర్పాటు చేశామన్నారు. అంతేమినహా అధికారులు దురుద్దేశంతో వాటిని తొలగించలేదని స్పష్టం చేశారు.

మాలలంతా చైతన్యవంతులు కావాలి

- హలో మాల.. చలో ఒంగోలును విజయవంతం చేయాలి

ఒంగోలు సెంట్రల్: మాలలంతా చైతన్యవంతులై ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఎంసీఏ భవనంలో గురువారం మాల ఉద్యోగ సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఈ నెల 14వ తేదీ ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే హలో మాల.. చలో ఒంగోలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యవక్తలుగా ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్, మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకటరావు, రిటైర్డ్ జడ్జి జడ శ్రావణ్‌కుమార్, తదితర ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. మనువాద పార్టీలు దళితుల ఎదుగుదలను అడ్డుకునేందుకు దళితుల్లోనే విభేదాలు సృష్టించి రాజ్యాధికారాన్ని దూరం చేసే ఆలోచన చేస్తున్నాయని ఆరోపించారు. దళితులంతా ఈ కుట్రను ఐక్యంగా ఎదుర్కోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగ సంఘాల నాయకులు బి.గోపీనాథ్, కె.బాబూరావు, వై.మల్లికార్జునరావు, టి.అశోక్, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల ఉద్యోగ సంఘాల నాయకులు

ఏచూరికి జిల్లాతో అనుబంధం

ఒంగోలు టౌన్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో ఏచూరి చిత్రపటానికి గురువారం జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాతో ఏచూరికి ఉన్న అనుబంధాన్ని సీపీఎం నాయకులు గుర్తు చేసుకున్నారు. 1984లో ఒంగోలులో జరిగిన భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా సమావేశాల్లో ఏచూరి పాల్గొని ప్రసంగించారని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. 1994లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మిత్రపక్షాల తరఫున సీపీఎం అభ్యర్థిగా పోటీచేసిన తవనం చెంచయ్య విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారని, మైనంపాడులో జరిగిన సభలో ప్రసంగించారని చెప్పారు. 2009లో కూడా సంతనూతలపాడు ఎన్నికల ప్రచారంలో పాల్గొని విస్తృతంగా పర్యటించారని తెలిపారు. అంతేగాకుండా జిల్లాలో జరిగిన అనేక ఉద్యమాలలో ఏచూరి పాల్గొన్నారని గుర్తు చేశారు.

ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు...

ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు, ఫాసిస్టు వ్యతిరేక పోరాటాలకు తీరని లోటని వివిధ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, గంటినపల్లి శ్రీనివాసరావు, సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా నాయకుడు భీమవరపు సుబ్బారావు ఏచూరి సేవలను కొనియాడారు.



2009లో సంతనూతలపాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చిన ఏచూరి

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బియ్యం ఆటో

కంభం: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. అర్ధవీడు మండలంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని ఆటోలో తీసుకెళ్తుండగా తెల్లవారుజామున 4 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వలపన్ని ఆటోను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆటోలో 30 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అర్ధవీడు మండలంలోని పలు గ్రామాల్లో బియ్యం కొనుగోలు చేసి పెద్దారవీడుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం.

తండ్రిపై ఇటుకరాయితో దాడి



చికిత్స పొందుతున్న గాలెయ్య

కంభం: ఓ వ్యక్తి వృద్ధుడైన తన తండ్రిపై ఇటుకరాయితో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన గురువారం కంభం మండలం తురిమెళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. తురిమెళ్లలో నివాసం ఉంటున్న గాలెయ్యపై కొడుకు జమాల్ ఇటుక రాయితో దాడి చేశాడు. క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇన్వర్టర్ బ్యాటరీ పెట్టుకునే విషయమై వివాదం తలెత్తడంతో దాడికి పాల్పడినట్లు సమాచారం.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు గురవయ్య

వెలిగండ్ల: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని అర్ధంతరంగా తనువు చాలించాడు. ఈ సంఘటన గురువారం వెలిగండ్ల మండలంలోని పద్మాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై అహరోను కథనం ప్రకారం.. పద్మాపురం గ్రామానికి చెందిన ధర్మరాజు గురవయ్య(53) కొంత కాలం నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. జీవితం మీద విరక్తి చెందిన ఆయన తన రేకుల షెడ్డులో వైరు సహాయంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ ఫ్లోర్ బాల్ పోటీలకు ముగ్గురు బాలికలు ఎంపిక



బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం పద్మజ

సింగరాయకొండ: జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలకు అండర్-14 విభాగంలో పాత సింగరాయకొండ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. ఈ నెల ఒకటో తేదీన నరసరావుపేటలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన 18వ రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో సీహెచ్ తులసి, డి.అక్షర, సీహెచ్ పూజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సీహెచ్ పద్మజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరు ఈ నెల 27వ తేదీన తమిళనాడు రాష్ట్రం చెంగల్‌పట్టులో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎండీ అన్వర్ తెలిపారు. ముగ్గురు బాలికలకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

బీచ్‌లో వివాహిత ఆత్మహత్యాయత్నం

- కాపాడిన మెరైన్ పోలీసులు



లీలావతిని కాపాడిన మెరైన్ పోలీసులు

సింగరాయకొండ: కుటుంబ సమస్యల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మహిళను మెరైన్ పోలీసులు కాపాడి సురక్షితంగా బంధువులకు అప్పగించిన సంఘటన గురువారం రాత్రి పాకల బీచ్‌లో చోటుచేసుకుంది. మెరైన్ పోలీసుల కథనం ప్రకారం.. టంగుటూరులోని చెల్లెమ్మతోటకు చెందిన జంపాల లీలావతి(45) కుటుంబ సమస్యల కారణంగా సాయంత్రం 4 గంటల సమయంలో పాకల బీచ్‌కు వచ్చింది. చీకటి పడిన తర్వాత ఆమె సముద్రంలో పడి ఆత్మహత్యకు ప్రయత్నించగా బీచ్ ఒడ్డున బందోబస్తు విధుల్లో ఉన్న రామాయపట్నం మెరైన్ ఎస్సై షేక్ మస్తాన్ షరీఫ్, సిబ్బంది గుర్తించారు. హుటాహుటిన ఆమె వద్దకు చేరుకుని బంధువులకు సమాచారం ఇచ్చి క్షేమంగా అప్పగించారు.

ఈ-పంట జాప్యం.. రైతులకు శాపం!

- జిల్లాలో ఇప్పటి వరకు 87 శాతం పంట నమోదు
- ఈనెల 15వ తేదీతో ముగియనున్న గడువు
- ఆలస్యంగా నమోదుతో పలు పంటల రైతులకు నష్టం
- జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 4,99,757 ఎకరాలు
- సాగు చేసింది 2,15,702.42 ఎకరాలు
- ఈ-పంటలో నమోదైంది సుమారు 1.55 లక్షల ఎకరాలు



తాళ్లూరులో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఒంగోలు సెంట్రల్:

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ‘ఈ-క్రాప్’ అనే చిన్న పదం రైతుల జీవితాల్లో వెలుగులు నింపింది. వ్యవసాయ రంగంలో సరికొత్త ఒరవడిని తీసుకొచ్చింది. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. సాగుపై ధీమా కల్పించింది. సాగు పేరిట దోపిడీకి అడ్డుకట్ట వేసింది. ఇటువంటి బృహత్తర విధానాన్ని ప్రవేశపెట్టిన అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని దేశమే కీర్తించింది. శుష్క వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని నిర్వీర్యం చేయాలని, పంట బీమా నగదు చెల్లింపు నుంచి తప్పించుకోవాలని భావించింది. ఈ విధానంపై అధ్యయనం పేరుతో కుట్రలకు తెరలేపింది. అయితే రైతులు, రైతు సంఘాల నాయకుల హెచ్చరికలతో తత్తరపడిన కూటమి ప్రభుత్వం ఈ-క్రాప్‌ను ఈ-పంటగా మార్చి కొనసాగించింది. అయితే ఈ-పంటను వదిలించుకోవాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా వదిలిపెట్టలేదు. పంట నమోదులో జాప్యం చేయడం ద్వారా రైతులను క్రమంగా సబ్సిడీలు, పరిహారానికి దూరం చేసేందుకు పావులు కదిపిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 38 మండలాల్లో 80,341 మంది రైతులు 2,15,702.42 ఎకరాలు సాగు చేయగా వీఏఏ లాగిన్‌లో 1,89,299.1 ఎకరాలు నమోదు చేశారు. వీఆర్‌ఓల లాగిన్‌లో మాత్రం 1,54,815.89 ఎకరాలు నమోదు చేశారు. కాగా, సెప్టెంబర్ 15వ తేదీతో ఈ-క్రాప్ గడువు ముగియనుంది. గ్రామ సభల నిర్వహణ అనంతరం అర్హుల తుది జాబితా సెప్టెంబర్ 30న విడుదల చేయనున్నారు.

రైతులకు నష్టం

సకాలంలో వర్షాలు కురవకపోవడం, బోర్లలో నీరు తగ్గముఖం పట్టడం తదితర కారణాలతో జిల్లాలో పలు మండలాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు చోట్ల దెబ్బతిన్న పంటను సైతం దున్నేశారు. ఈ-పంట నమోదు అయి ఉన్నట్లయితే దున్నేసిన పంటలకు నష్ట పరిహారం వచ్చి ఉండేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు.

గతం ప్రభుత్వంలో రైతులకు అండగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సౌలభ్యం కోసం వ్యవసాయశాఖ నిపుణుల సూచనల మేరకు ఈ క్రాప్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఆరుగాలం శ్రమించి రైతు పండించిన ప్రతి గింజకూ గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ విధానం సరికొత్త ఒరవడిని సృష్టించింది. గత ప్రభుత్వం 2019 రబీ సీజన్‌లో ప్రారంభించిన ఈ-క్రాప్‌ను ఐదేళ్ల పాటు సమర్థవంతంగా అమలు చేసింది. రైతులకు అన్ని విధాలుగా సహాయం అందిస్తూ నిర్ణీత వ్యవధిలోగా పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి ధాన్యం సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో పడేలా చేసి అండగా నిలిచింది.

ఈ-పంటతో ప్రయోజనాలివే..

రైతులు, కౌలు రైతులంతా ఈ-పంటలో నమోదు చేసుకుంటే అనేక లాభాలు ఉంటాయి. ఈ-నమోదు ఆధారంగా ఆ సర్వే నంబర్, భూమి వివరాలు సమగ్రంగా ఉంటాయి. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అందిస్తుంది. రాయితీపై విత్తనాలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీలను సమయాన్ని బట్టి ఇస్తారు. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ పొందే వీలుంటుంది. ఈ కేవైసీ ఆధారంగా సాగు చేపట్టని అనర్హులను తొలగించి అర్హులకు ప్రయోజనం చేకూరుస్తారు.

సబ్ డివిజన్ల వారీగా ఖరీఫ్ పంట నమోదు ఇలా ..

సబ్ డివిజన్	రైతుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ-పంటలో నమోదైంది
దర్శి	23891	69148.59	58775.34
గిద్దలూరు	13530	28244.47	24909.87
కనిగిరి	9976	32075.09	28137.34
మార్కాపురం	11533	25233.20	22171.80
ఒంగోలు	4418	13209.94	12891.11
సింగరాయకొండ	3240	11372.33	10908.71
వై పాలెం	13753	36418.80	31504.93
మొత్తం	80,341	2,15,702.42	1,89,299.1

పచ్చ నేత దాష్టీకం

- పొన్నలూరు మండలం పెదవెంకన్నపాలెంలో పొలం బాట దున్ని జామాయిల్ సాగు
- ప్రశ్నించినందుకు పక్క రైతు పొలంలోని 100 జామాయిల్ చెట్లు నరికివేత
- మంత్రి స్వామి అండదండలు ఉన్నాయంటూ రైతులకు బెదిరింపు
- ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతు



తన పొలంలో నరికివేసిన జామాయిల్ చెట్లు, వేణు దున్నిన పొలం బాటను చూపిస్తున్న రైతు ప్రసాద్



గత ఫిబ్రవరిలో ఆక్రమిత పొలం బాటను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

పొన్నలూరు: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆగడాలు, దౌర్జన్యాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. దాష్టీకాలపై ప్రశ్నించి వారిపై అధికార మదంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పొన్నలూరు మండలం పెదవెంకన్నపాలెం గ్రామంలో రెవెన్యూ సర్వే నంబర్ 81-2లో గ్రామానికి చెందిన నవులూరి ప్రసాద్‌కు 1.83 ఎకరాల అసైన్‌మెంట్ పట్టా భూమి ఉంది. ఈ భూమిలో ఏడాది క్రితం జామాయిల్ మొక్కలు నాటాడు. అయితే ప్రసాద్ పొలం పక్కనే పెదవెంకన్నపాలెం నుంచి పొన్నలూరుకు రాకపోకలు సాగించేందుకు ఆరు లింకుల పొలం బాట ఉంది. పొలం బాట పక్కనే సర్వే నంబర్ 82లో 1.80 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిని గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు చల్లా వేణు ఆక్రమించి జామాయిల్ మొక్కలు నాటాడు. ఆరు లింకుల పొలం బాటను కూడా దున్నేసి జామాయిల్ మొక్కలు నాటాడు. అంతేకాదు పక్కనే ఉన్న రైతు ప్రసాద్ పొలం మీదుగా బాట ఏర్పాటు చేసుకుని పైఎత్తున పొలాలు ఉన్న రైతులు వెళ్లాలని ఉచిత సలహా ఇచ్చాడు. దీంతో కంగుతిన్న రైతులు గత ఫిబ్రవరిలో అప్పటి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ తమ సిబ్బంది, పోలీసులను వెంటబెట్టుకుని ఆక్రమిత బాట దగ్గరకు వచ్చి విచారణ చేపట్టారు. రెవెన్యూ రికార్డులు, విలేజ్ మ్యాప్ ప్రకారం రైతులు పొలాలకు వెళ్లేందుకు ఆరు లింకుల బాట ఉందని స్పష్టం చేశారు. ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాటలో సాగు చేసిన జామాయిల్ మొక్కలను వీఆర్‌ఏలతో తొలగించారు. దీంతో రైతులు రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమమైంది.

మంత్రి స్వామి ఉన్నాడు.. దిక్కున్న చోట చెప్పుకోండి

రెవెన్యూ అధికారుల హెచ్చరికతో కొంత కాలం స్తబ్దుగా ఉన్న చల్లా వేణు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ బాటను ఆక్రమించి జామాయిల్ సాగు చేశాడు. ఎగువ పొలాల రైతులు ప్రశ్నించడంతో తనకు మంత్రి స్వామి అండదండలు ఉన్నాయని, మీ దిక్కున్న చోట చెప్పుకోండని బెదిరిస్తున్నాడని వాపోయారు. ఎక్కువ మాట్లాడితే కేసులు బనాయిస్తామని హెచ్చరించినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జామాయిల్ చెట్లు నరికివేత..

టీడీపీ సానుభూతిపరుడు చల్లా వేణు రైతులను బెదిరించడమే కాకుండా పక్కనే ఉన్న రైతు నవులూరి ప్రసాద్ పొలంలోని ఒక సాలు మందం సుమారుగా వంద జామాయిల్ చెట్లు నరికేశాడు. పొలం బాటలో సాగు చేసిన జామాయిల్ మొక్కలు తొలగించనని, కావాలంటే ప్రసాద్ పొలంలో బాటను ఏర్పాటు చేసుకుని వెళ్లాలని రైతులను హెచ్చరించాడు. తన పొలంలో జామాయిల్ చెట్లు నరికి వేసిన విషయం తెలుసుకున్న ప్రసాద్ పొలం దగ్గరకు చేరుకుని కన్నీరు పెట్టాడు. ప్రభుత్వ భూమితో పాటు పొలం బాటను ఆక్రమించి సాగుచేయడమే కాకుండా తన పొలంలోని జామాయిల్ చెట్లను నరికివేసి నష్టపరచడం దారుణమని తనకు న్యాయం చేయాలని ఆధారాలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అడవిపంది దాడిలో రైతుకు తీవ్రగాయాలు

- మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలింపు



అడవిపంది దాడిలో తీవ్రంగా గాయపడిన జయరామిరెడ్డి



జయరామిరెడ్డిని పరామర్శిస్తున్న ఫారెస్టు రేంజ్ అధికారి విశ్వేశ్వరరావు

పెద్దదోర్నాల: పశుగ్రాసం కోసం పొలం వెళ్లిన ఓ రైతుపై అడవిపంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సంఘటన ప్రకాశం జిల్లాలోని పెద్దదోర్నాల మండలం కొత్తూరులో చోటుచేసుకుంది. బాధితుడి భార్య శివమ్మ కథనం మేరకు... కొత్తూరుకు చెందిన రైతు యేరువ జయరామిరెడ్డి గ్రామ సమీపంలో కౌలుకు తీసుకున్న వ్యవసాయ భూమిలో పత్తి సాగుచేశాడు. పత్తి తీసేందుకు గ్రామానికి చెందిన పలువురు కూలీలతో కలిసి పొలం వెళ్లాడు. పొలంలోని ఓవైపు కూలీలు పత్తి తీస్తుండగా, మరోవైపు సాగుచేసిన పశుగ్రాసాన్ని పశువుల కోసం జయరామిరెడ్డి సేకరిస్తున్నాడు. ఆ సమయంలో పత్తి తీస్తున్న కూలీలకు పిల్లలతో కలిసి ఉన్న అడవిపంది కంటపడింది. దీంతో గట్టిగా కేకలు వేస్తూ అడవిపంది సమూహాన్ని తరుముకున్నారు. అయితే, అడవిపంది మాత్రం గడ్డి కోస్తున్న జయరామిరెడ్డి వైపునకు వెళ్లి అతనిపై దాడికి దిగింది. అతని రెండు తొడలను కొరికి తీవ్రంగా గాయపరిచింది. గాయాలపాలైన జయరామిరెడ్డిని మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని వైద్యశాలకు తరలించారు.

సమాచారం అందుకున్న పెద్దదోర్నాల ఫారెస్టు రేంజ్ అధికారి విశ్వేశ్వరరావు పెద్దదోర్నాల వైద్యశాలలో జయరామిరెడ్డిని పరామర్శించారు. అటవీశాఖ తరఫున ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని పంట పొలాలను అడవి పందులు సర్వనాశనం చేస్తున్నాయని, సమస్యను పరిష్కరించాలని కొత్తూరుకు చెందిన పలువురు రైతులు ఫారెస్ట్ రేంజ్ అధికారికి మొరపెట్టుకున్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్



ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: రాజీపడదగిన కేసులపై కక్షిదారులకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలని, ఈ నెల 14వ తేదీన లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంపౌండ్ క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, మోటారు బైక్ ప్రమాదాలు, చిట్ ఫండ్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం రాజీ పడదగిన కేసుల జాబితా తయారు చేసుకోవాలని, దాని ప్రకారం ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. పరస్పరం కేసులు పెట్టుకొని ఇరువర్గాలు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం ద్వారా సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోకుండా పరస్పర అంగీకారంతో రాజీ చేసుకునే అవకాశం లోక్ అదాలత్ ద్వారా కల్పించబడిందని, జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

కుట్ర రాజకీయాలు సరికాదు

- తాళ్లూరు జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి

తాళ్లూరు(దర్శి): రాజకీయ దురుద్దేశంతోనే తనపై లేని పోని ఆరోపణలు చేస్తున్నారని తాళ్లూరు జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాలెంలోని బ్రిక్స్ వద్ద గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ దిన పత్రిక(సాక్షి కాదు)లో తనపై వచ్చిన ఆరోపణలు కేవలం రాజకీయ కుట్ర కోణంలోనే ప్రచురించారని మండిపడ్డారు. తన అల్లుడు నాగార్జున రెడ్డి వ్యాపారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, వారిలో ఎవరైనా సరే నాతో లావాదేవీలు నిర్వహించినట్లు నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా సిద్ధమేనన్నారు. తాము భూములు అమ్ముకొని రాజకీయాలు చేశామే గానీ ఏనాడూ ఎవరికీ అన్యాయం చేయలేదని స్పష్టం చేశారు. నిరాధార వార్తలు ప్రచురించి తమ కుటుంబ పరువు తీసే ప్రయత్నం చేయడం తగదని హితవు పలికారు.

ఆకట్టుకున్న ‘ధన’నాథుడు



మార్కాపురం: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మార్కాపురం పట్టణంలోని పేరం బజారులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని రూ.2.50 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ‘ధన’నాథుడిని కనులారా తిలకించి భక్తితో పూజలు చేశారు.

గణేశ్ నిమజ్జనంలో టీడీపీ శ్రేణుల వికృతచేష్టలు

- బండి వెలిగండ్లలో వైఎస్సార్ సీపీ మహిళలపై దాడి
- ఎదుటే దాడి చేస్తున్నా గుడ్లప్పగించి చూసిన పోలీసులు



ఇంటి ముందు రంగు శుభ్రం చేసుకుంటున్న మహిళలు



వైఎస్సార్ సీపీ నేతల ఇళ్ల వద్ద చల్లిన పసుపు

దర్శి: గణేశ్ నిమజ్జన ఉత్సవం పేరుతో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఇళ్లలో మహిలను పచ్చి బూతులు తిడుతూ గ్రామం నుంచి వెళ్లిపోవాలని దాడికి పాల్పడ్డారు. దర్శి మండలం బండి వెలిగండ్ల గ్రామంలో పోలీసుల కళ్లెదుటే జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో టీడీపీ సానుభూతిపరులు ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాన్ని గురువారం నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఇళ్ల వద్దకు రాగానే డీజే సౌండ్ పెంచడంతోపాటు టీడీపీ పాటలు పెట్టి రెచ్చగొట్టారు. గొడవ చేసేందుకు సిద్ధమయ్యారని ముందుగానే గ్రహించిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు తమ పిల్లలను పొలాలకు పంపారు. ఇళ్లలో మహిళలు మాత్రమే ఉండటాన్ని గమనించిన టీడీపీ కార్యకర్తలు మద్యం మత్తులో పసుపు రంగు చల్లి, దాడికి పాల్పడ్డారు. ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలపై దాడి చేసినట్లు బాధితులు వాపోయారు. ఈ దాడి పోలీసుల కళ్లెదుటే జరుగుతున్నా గుడ్లప్పగించి చూశారే తప్ప, టీడీపీ కార్యకర్తలను నిలువరించలేదని మహిళలు ఆరోపించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో

- జూనియర్ లైన్‌మన్, వాచ్‌మన్, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన విద్యుత్ జేఎల్‌ఎం అశోక్



గాయపడిన రవి



వాచ్‌మెన్ రాజశేఖర్

బేస్తవారిపేట: బైక్‌ను రాంగ్ రూట్‌లో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం స్థానిక పీహెచ్‌సీ సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవేపై చోటుచేసుకుంది. విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ అశోక్, విద్యుత్ కార్యాలయంలో పనిచేస్తున్న వాచ్‌మెన్ దగ్గుపాటి రాజశేఖర్, మరో వ్యక్తి రవి మోటారు సైకిల్‌పై బేస్తవారిపేట జంక్షన్ నుంచి పాపాయి పల్లెకు వెళ్తున్నారు. జేసీ అగ్రహారం నుంచి బేస్తవారిపేట వైపునకు వస్తున్న ఆటో రాంగ్‌రూట్‌లో వెళ్లి బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు పల్టీలు కొట్టుకుంటూ రోడ్డు పక్కన గుంతలో పడిపోయారు. అశోక్ పాదం పూర్తిగా తెగిపోయింది, మూడు చోట్ల చెయ్యి విరిగింది. రాజశేఖర్, రవికి మోకాళ్లు విరిగాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ముగ్గురినీ నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తెలిపారు.